క్లుప్తంగా

మహాలక్ష్మి అమ్మవారికి చండీ హోమం



అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

పిఠాపురం: పట్టణంలో వేంచేసిన శృంగేరి శంకర మఠం శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారికి చండీహోమం నిర్వహించారు. ఉదయం పండితులు అమ్మవారికి ప్రాతఃకాల అర్చనలు, శ్రీసూక్త పారాయణ, శ్రీచక్రార్చన, అభిషేకాలు, లక్ష్మీనారాయణ హోమం, దర్బారు సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేటితో ముగియనున్న నూకాలమ్మ ఉత్సవాలు



సామర్లకోటలో చిల్లర నాణేలతో నూకాలమ్మ వారికి అలంకరణ

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లోని నూకాలమ్మ ఆలయం వద్ద నిర్వహిస్తున్న ఉత్సవాలు ఆదివారంతో ముగుస్తాయని ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య తెలిపారు. ఆదివారం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారులచే కోలాటం జరుగుతాయన్నారు. ఆలయం వద్ద భక్తులకు అన్నసమారాధన నిర్వహిస్తామని చెప్పారు. అమ్మవారికి చిల్లర నాణేలతో చేసిన అలంకరణ కూడా ముగుస్తుందన్నారు.

వాటర్ ట్యాంకుకు శంకుస్థాపన



తమ్మయ్యపేటలో వాటర్ ట్యాంకుకు శంకుస్థాపన చేసిన నాయకులు

కొత్తపల్లి: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని సర్పంచ్ పులి జయబాబు అన్నారు. మండలంలోని అమరవల్లి శివారు తమ్మయ్యపేటలో మండల పరిషత్ నిధులు రూ.3 లక్షలతో నిర్మించనున్న వాటర్ ట్యాంకుకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పెండెం దొరబాబు సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అహ్మద్ వలీ, కర్వీనర్ కాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి రంగా విగ్రహం ధ్వంసం

కొత్తపల్లి: స్థానిక ఊరచెరువు సెంటర్‌లో ఏర్పాటు చేసిన కాపు నాయకుడు వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు శనివారం ధ్వంసం చేశారు. దీనిపై కాపు సంఘ నేతలు, యువకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై రామలింగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫిర్యాదు చేసిన వారిలో జి.గంగబాబు, సీహెచ్ శ్రీరామచంద్రరావు, సీహెచ్ చక్రధరరావు, మోకా వెంకట రమణ, జోకా ప్రేమ్ కుమార్ తదితరులు ఉన్నారు.

యువకుడిపై కేసు

కొత్తపల్లి: బాలికను ప్రేమ పేరుతో మోసగించిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు శనివారం స్థానిక పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని పొన్నాడ శివారు కొనపాపపేటకు చెందిన బాలికను ఉప్పాడకు చెందిన గంటా ఏసు ప్రేమ పేరుతో నమ్మించి మోసగించాడు. ఈ నెల 17న బాలికను కాకినాడ తీసుకువెళ్లి లైంగిక దాడి చేశారు. దీనిపై బాలిక తల్లి అమజాలపు మహాలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షటిల్ టోర్నమెంట్ ప్రారంభం

కాకినాడ క్రైం: కాకినాడ ఆఫీసర్స్ క్లబ్‌లో ఏర్పాటైన కిరణ్ మెమోరియల్ షటిల్ టోర్నమెంట్‌ను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆంధ్రప్రదేశ్ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డితో కలసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రీడలు మనోవికాసం, దేహ దారుఢ్యం, క్రమశిక్షణకు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, క్రీడా నిర్వహణ బృందం పాల్గొన్నారు.

ఐక్యతకు ప్రతీక రంజాన్

- హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు
- ముగిసిన ఉపవాస దీక్షలు
- మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు



పెద్దాపురం ఈద్గా మెట్ట వద్ద రంజాన్ విశిష్టతను వివరిస్తున్న మౌలానా



సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ముస్లింల ప్రార్థనలు



పిఠాపురంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

సామర్లకోట: ఐక్యతకు ప్రతీక రంజాన్ అని, ముస్లింలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. శనివారం రంజాన్ సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పురుషులు, మహిళలు వేర్వేరుగా ప్రార్థనలు చేశారు. ముఖ్య అతిథిగా దవులూరి దొరబాబు పాల్గొని ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింల మత గురువు ఎండీ హతవ్ రంజాన్ మాసం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం దవులూరి దొరబాబు మాట్లాడుతూ క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ అని అన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించారని, అదేబాటలో ప్రస్తుత సీఎం జగన్ సాగుతున్నారన్నారు. మున్సిపల్ వైస్ చెర్మన్ ఊబా జాన్‌మోజెస్, కౌన్సిలర్లు పిట్టా సత్యనారాయణ, మంత్రి శేషారావు, పాలిక కుసుమ చంటి, జట్ల మోహన్, నేతల హరిబాబు, క్రిస్టియన్ మైనార్టీ కోఆప్షన్ సభ్యుడు సల్లూరి కల్యాణ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం నాయకులు మహ్మద్ ఉభయదుల్లా, ఎండీ హబీబుల్లా, ఎండీ తవ్వాబ్, ఎండీ లాహేర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉన్న మసీదులో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. జనసేన కన్వీనర్ తుమ్మల బాబు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

పెద్దాపురం: రంజాన్ వేడుకలను పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు.



సామర్లకోటలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న దవులూరి దొరబాబు

స్థానిక కట్టమూరు పుంతలోని ఈద్గా మెట్ట వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జామియా మసీదు ఇమామ్ మౌలానా షరీఫుల్ రహీమ్ నమాజ్ చదివారు. అనంతరం ముస్లింలు ఒకరికి ఒకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. జామియా మసీదు అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, ఆగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, మహబూబ్ షరీఫ్, ముస్తాఫా, షేక్ బషీర్, ఎంఏ లాయక్ అలీ, కోఆప్షన్ సభ్యుడు షేక్ రఫీ, జానీ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్

పిఠాపురం: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే రంజాన్ పండగను పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లోని ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉదయం నుంచి మసీదులకు చేరుకున్న ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆనందంగా జీవించాలని అల్లాకు ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

మేడే విజయవంతం చేయాలి



వేట్లపాలెంలో మేడే కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

సామర్లకోట: కార్మిక దినోత్సవం మేడేను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలం శ్రీనివాసు పిలుపునిచ్చారు. శనివారం వేట్లపాలెం, మేడపాడు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయాల వద్ద మే డే కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. వచ్చే నెల 1న జరిగే ర్యాలీలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. సీఐటీయూ నాయకులు కె.లోవబాబు, పలిక త్రిమూర్తులు, షేక్ ఖాజా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారావుకు ఎంపీ బోస్ పరామర్శ



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుబ్బారావును పరామర్శిస్తున్న ఎంపీ బోస్ తదితరులు

సామర్లకోట: రాష్ట్ర కార్మిక సంఘ మాజీ అధ్యక్షుడు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు తండ్రి దవులూరి సుబ్బారావును ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ శనివారం పరామర్శించారు. 17న పిఠాపురం రోడ్డులో ఉన్న పొలంలోకి వెళ్లిన సమయంలో సుబ్బారావును పాము కాటు వేసిన విషయం విదితమే. దీంతో ఏడీబీ రోడ్డులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆరు రోజులుగా ఆయన చికిత్స పొందుతున్నారు. సుబ్బారావును బోస్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ పేర్పిడి వెంకట్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ సీఎం జగనన్నే..



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎంపీ బోస్, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు

- ప్రజలంతా చెబుతున్న మాట ఇది
- జి.రాగంపేటలో ఎంపీ సుభాష్ చంద్రబోస్

పెద్దాపురం: వచ్చే ఎన్నికల్లో తిరిగి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించుకుంటామని ప్రజలంతా ఘంటాపథంగా చెబుతున్నారని వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్, ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. పెద్దాపురం మండలం జి.రాగంపేటలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, ఏఎంసీ వైస్ చైర్మన్ బండారు వీరబాబులతో కలసి శనివారం సాయంత్రం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. హౌసింగ్ చైర్మన్ దొరబాబు, ఎంపీ బోస్‌లు ఇంటింటికీ వెళ్లి ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ప్రజల అంగీకారంతో జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్లను అతికించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో బోస్, దొరబాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనపై పూర్తి సంతృప్తితో ఉన్నారన్నారు. ఏపీలో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారని, ఇది మా ఒక్కరి అభిప్రాయమే కాదని ప్రజలంతా చెబుతున్నారని అన్నారు. ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు తెచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఎంపీపీలు పెంకే సత్యవతి, బొబ్బరాడ సత్తిబాబు, సచివాలయ కన్వీనర్ల మండల అధ్యక్షుడు గోపు మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బంగారు కృష్ణ, వ్యవసాయ సలహా మండలి సభ్యులు యినకొండ వీరవిష్ణుచక్రం, ఏలేటి అనంతలక్ష్మి, ఎంపీటీసీ కాలే అనురాధ, వడ్డికాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్తు

కొత్తపల్లి: మండలంలోని కొత్త మూలపేటలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, గృహసారథులు, వలంటీర్లు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. ప్రభుత్వానికి మద్దతు తెలిపిన వారి కుటుంబాలకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. మాజీ సర్పంచ్ వడ్డి నాగమణి, పలువురు నాయకులు పాల్గొన్నారు.



కొత్త మూలపేటలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నేడు ఉచిత వైద్య శిబిరం

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు 108 ఉద్యోగి విన్నకోట సురేష్ తెలిపారు. షుగర్, బీపీ తదితర పరీక్షలు ఉచితంగా చేసి అవసరమైన వారికి మందులు ఇస్తామన్నారు. ఉదయం 6.30 నుంచి శిబిరం ఉంటుందన్నారు. ఈ శిబిరాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన వివరించారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ పథకాలు



మంగితుర్తిలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- మంగితుర్తిలో గడప గడపకూ మన ప్రభుత్వం

పిఠాపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజల చెంతకే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం మండలం మంగితుర్తిలో శనివారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. రోడ్లు, డ్రైన్లు, వీధి దీపాలు, పింఛన్లు తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల చెంతకే పాలనను తీసుకురావడం కోసమే ముఖ్యమంత్రి గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఆచరణలోకి తీసుకొచ్చారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే వాటిని రద్దు చేస్తామంటున్నారంటే వారికి ప్రజల చెంతకు పాలన వెళ్లడం ఇష్టం లేదని అర్థమవుతోందన్నారు. సీఎం వైఎస్ జగన్ అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. తమ ప్రభుత్వంలో అర్హత గల ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కసిరెడ్డి శివజ్యోతి, అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా రబీ వరి కోతలు



కొత్తపల్లి మండలంలో యంత్రంతో వరి కోతలు



ధాన్యాన్ని బస్తాల్లో నింపుతున్న కూలీలు

కొత్తపల్లి: నియోజకవర్గంలో రబీ వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కూలీల కొరత తీవ్రంగా ఉండడంతో రైతులు యంత్రాలపై ఆధారపడుతున్నారు. కొత్తపల్లి మండలంలో ఈ ఏడాది సుమారు 10237 ఎకరాల్లో రైతులు రబీ వరిసాగు చేశారు. ఇప్పటివరకూ 2500 ఎకరాల్లో కోతలు పూర్తయినట్టు అధికారులు తెలిపారు. ఖర్చు తగ్గడంతో రైతులు యంత్రాలతో కోతలు కోసేందుకు మొగ్గు చూపుతున్నారు. కాగా గ్రామాల్లోని ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు మండల వ్యవసాయాధికారి జోగిరాజు తెలిపారు. రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రబీ పంట ఒబ్బిడి చేసిన రైతులు అపరాల సాగుపై దృష్టి సారించాలని సూచించారు.

కిటకిటలాడిన శృంగార వల్లభుని ఆలయం



తిరుపతిలో శృంగారవల్లభ స్వామి

పెద్దాపురం: తొలి తిరుపతి స్వయంభూగా పిలువబడే శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. అక్షర తృతీయ, నెల పొడుపు, సెలవు దినం కావడంతో వేకువజాము నుంచే రద్దీ నెలకొంది. కాకినాడ జిల్లా దేవదాయ శాఖ కమిషనర్, ఇన్‌చార్జి ఆలయ కార్యనిర్వహణాధికారి పులి నారాయణమూర్తి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు స్వామివారికి తులసి దళాలతో స్వామికి అలంకరణ చేశారు. ఆలయంలో అన్నసమారాధన, విరాళాలు, దర్శనం, కేశఖండన టిక్కెట్ల విక్రయాల ద్వారా శనివారం రూ.4.42 లక్షల ఆదాయం సమకూరిందని ఈఓ నారాయణమూర్తి తెలిపారు. 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు వివరించారు.

ఆలయానికి గోవు బహూకరణ

సామర్లకోట: స్థానిక మాండవ్య నారాయణస్వామి ఆలయంలో నిత్యం ఆవు పాలతో పూజలు జరిగే విధంగా పారిశ్రామిక వేత్త బిక్కిన సత్యసాయి కుటుంబ సభ్యులు గోవును బహూకరించారు. ఈ మేరకు ఆలయంలో గోపూజ చేశారు. పరశురామ జయంతిని పురస్కరించుకుని ఆవును అందించారు. అనంతరం దాత సాయి కుటుంబ సభ్యులు పూజలు చేశారు.



సామర్లకోట మాండవ్య నారాయణస్వామి ఆలయంలో గోపూజ చేస్తున్న బిక్కిన సత్యసాయి కుటుంబ సభ్యులు

14న శోభాయాత్ర

హనుమాన్ జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకుని వచ్చే నెల 14న హనుమాన్ శోభాయాత్ర జరుగుతుందని నిర్వాహకులు కర్రి ఆదినారాయణ రెడ్డి, పి.ప్రభాకర్, ఎం.వీరబాబు, జీవీకే మోహన్‌రావు తెలిపారు. సామర్లకోట ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం నుంచి మోటార్ సైకిళ్లతో యాత్ర నిర్వహిస్తామన్నారు. ఇందులో పాల్గొనే వారు ముందుగా సంప్రదించాలన్నారు.

క్షతగాత్రుడికి ఆర్థిక సాయం



కాకినాడలో చికిత్స పొందుతున్న అబ్రహంకు చెక్కు అందజేసిన చర్చి యజమాని, దళిత సంఘ నాయకులు

సామర్లకోట: స్థానిక బలుసులపేటలో చర్చి గోడ కూలి తీవ్రంగా గాయపడి కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎడగల అబ్రహంకు శనివారం చర్చి యజమాని, స్థానిక దళిత సంఘ నాయకులు నష్ట పరిహారం అందజేశారు. గోడ కూలిన సంఘటనలో పిట్టా అర్జున్, మచ్చా నాగేశ్వరరావులు కాకినాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం విదితమే. దీంతో దళిత సంఘ నాయకులు పెద్దఎత్తున కాకినాడలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళనకు దిగడంతో చర్చి యజమాని నష్ట పరిహారం ఇవ్వడానికి అంగీకరించారు. మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు రూ.11.25 లక్షల చొప్పున ఇస్తానన్నారు. శుక్రవారం మృతుల కుటుంబ సభ్యులకు నష్ట పరిహార చెక్కులు అందజేశారు. శనివారం కాకినాడ ఆస్పత్రిలో రూ.11.25 లక్షల చెక్కును క్షతగాత్రుడు అబ్రహంకు అందజేశారు. స్థానిక బలుసులపేటకు చెందిన దళిత సంఘ నాయకులు పాల్గొన్నారు.

పటిష్టంగా వ్యర్థాల నిర్వహణ

కాకినాడ: ఘన వ్యర్థాల నిర్వహణను మరింత పటిష్టంగా చేపట్టాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల అధికారులకు సూచించారు. శనివారం స్థానిక ఇంటిగ్రేటెడ్ సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అక్కడ జరుగుతున్న కార్యకలాపాలను పర్యవేక్షించారు. ఎన్విరాన్ ఎకో మేనేజ్‌మెంట్ సంస్థ ద్వారా పొడి చెత్తను ప్రోసెసింగ్ చేస్తున్నట్లు డీఈ మాధవి కమిషనర్‌కు వివరించారు. అలాగే తడి చెత్త నుంచి ఆర్గానిక్ కంపోస్టు తయారీ చేస్తున్నామన్నారు. వీటి నిర్వహణను మరింత మెరుగుపర్చేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. అనంతరం పట్టణంలో పారిశుధ్య పనులను కమిషనర్ తనిఖీ చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

పిఠాపురం: యువత వాహనాలపై అతి వేగంగా వెళ్లి ప్రమాదాల బారిన పడి విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని, వేగం కన్నా ప్రాణం మిన్న అని తెలుసుకోవాలని సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ సూచించారు. గొల్లప్రోలు మండలం 216, 16 జాతీయ రహదారుల్లోని ముఖ్య కూడళ్లను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం గొల్లప్రోలు మండలం చేబ్రోలులో రోడ్డు ప్రమాదాల నివారణపై గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు జాగ్రత్తలు పాటించాలన్నారు. జాతీయ రహదారులను దాటేటప్పుడు, కూడళ్ల వద్ద చాలా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. రోడ్డు దాటేటప్పుడు వాహన వేగం పూర్తిగా తగ్గించి రెండు వైపులా వాహనాలను పరిశీలించాకే రోడ్డు దాటాలన్నారు. జాతీయ రహదారుల కూడళ్లలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్య కూడళ్ల వద్ద వాహనాల వేగాన్ని నిరోధించేలా స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట గొల్లప్రోలు ఎస్సై వినయ్ ప్రతాప్, ఉప సర్పంచ్ ఓరుగంటి చక్రధరుడు తదితరులు ఉన్నారు.



చేబ్రోలులో రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్

మల్ల యుద్ధభేరి రేపు

కాకినాడ సిటీ: భారత రాజ్యాంగ రక్షణ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, క్రైస్తవ, మైనారిటీ, మహిళల హక్కుల పరిరక్షణకు ఈ నెల 24న మెక్లారిన్ హైస్కూల్ గ్రౌండ్‌లో మాలల మల్ల యుద్ధభేరి మహాసభ నిర్వహించనున్నట్లు మాల మహానాడు వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సిద్దాంతుల కొండబాబు తెలిపారు. శనివారం స్థానిక శాంతిభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రమాల మహానాడు 7వ వార్షికోత్సవం సందర్భంగా చలో కాకినాడ నిర్వహిస్తామన్నారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలు, కరపత్రాలను విడుదల చేశారు. నాయకులు రత్నంబాబు, లింగం శివప్రసాద్, చెంగళరావు, గుబ్బల ఆదినారాయణ, లింగం నాని, అంబటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.